

రేపటి పీజీఆర్‌ఎస్ రద్దు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ సందర్భంగా సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. దీపావళి సందర్భంగా ప్రతి ఇంటిలో ఆనందం, సౌభాగ్యం, సుఖశాంతులు వెల్లివిరియాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.



దొంగ.. దొంగా!

- జిల్లాలో పెరుగుతున్న చోరీలు
- సవాల్‌గా మారుతున్న కేసులు
- పోలీసు శాఖలో సిబ్బంది కొరత
- తగ్గిన రాత్రి నిఘా



- ఈనెల 11న చీపురుపల్లి ఆంజనేయపురం కాలనీలో ఒమ్మి సురేష్ అనే ఉపాధ్యాయుడు ఇంట్లో దొంగలు పడ్డారు. వివాహానికి గాను సురేష్ దంపతులు రాజాం వెళ్లారు. తిరిగి అర్ధరాత్రి సమయంలో రాగా అప్పటికే దొంగలు ఇంట్లో ఉన్నారు. బీరువాలో ఉన్న 10 తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2.50 లక్షల నగదు పట్టుకుపోయారు.
- ఈ నెల 12న గంట్యాడ మండలం రామవరం పంచాయతీ జగదంబానగర్‌లో నివాసం ఉంటున్న కుప్పిలి శ్రీరామమూర్తి ఇంటిలో దొంగతనం జరిగింది. బీరువాలో ఉన్న ఒకటినర్న తులం గొలుసు, పావు తులం ఉంగరం చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- ఈ ఏడాది ఆగస్టు 12న కొత్తవలస బాలాజీనగర్‌లో భారీ చోరీ జరిగింది. వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగి కృష్ణంనాయుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించారు. బీరువాలోని 13 తులాల బంగారం, 50 కిలోల వెండి, రూ.1.50 లక్షల నగదును దోచుకుపోయారు.


జాగిలాల సాయంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

విజయనగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో దొంగలు రెచ్చిపోతున్నారు. తరచూ ఏదో ఒకచోట చోరీలకు పాల్పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలనే టార్గెట్ చేసుకొని బీభత్సం సృష్టిస్తున్నారు. ఇళ్లు, షాపులు, వాణిజ్య సముదాయాలు, చివరకు పొలాల్లో ఉన్న మోటార్లు, ఇంజన్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను సైతం చోరీ చేస్తున్నారు. నిఘా పటిష్టంతో పాటు గస్తీ ముమ్మరం చేసినట్టు పోలీసులు చెబుతున్నా.. దొంగతనాలు పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇంటర్ లాకింగ్ సిస్టంపై ప్రజల్లో అవగాహన కరువవుతోంది. బాధితుల ఫిర్యాదులపై కేసులు నమోదు చేస్తున్న పోలీసులు విచారణలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి చూపడం లేదు. జిల్లా మీదుగా నేషనల్ హైవే, అంతర్ రాష్ట్ర రహదారులు, రైలు మార్గం ఉండడం దొంగతనాల పెరుగుదలకు కారణమని పోలీసులు భావిస్తున్నారు. విజయనగరం ప్రధాన జంక్షన్‌గా ఉంది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేక పోలీస్‌స్టేషన్ల పరిధిలో దొంగతనాల కేసులు పెరుగుతున్నాయి. ఒడిశాతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ముఠాలు జిల్లాలో ప్రవేశించాయన్న హెచ్చరికలు పోలీసులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల విజయనగరంలో దొంగలు బీభత్సం సృష్టించారు. బిచ్చగాళ్ల రూపంలో వచ్చి దొంగతనాలకు విఫలయత్నం చేశారు. ఇది సీసీ ఫుటేజీల్లో స్పష్టంగా కనిపించింది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖ రాత్రిపూట వాహన తనిఖీలు, గస్తీలను ముమ్మరం చేసింది. పోలీసు సిబ్బంది క్షణం తీరిక లేకుండా గడుపుతున్నారు. అయితే, సిబ్బంది కొరత వేధిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ప్రతీ స్టేషన్‌కు సగటున 32 మందికిపైగా సిబ్బంది ఉండాల్సి ఉండగా.. అందులో నగం మంది కూడా లేరు.

అరకొరగా సిబ్బంది..

జిల్లాలో 27 మండలాల్లో పోలీసు స్టేషన్లు ఉన్నాయి. విజయనగరంతో పాటు రాజాం, బొబ్బిలిలో పట్టణ పోలీసుస్టేషన్లు కొనసాగుతున్నాయి. వీటితో పాటు సీసీఎస్, మహిళా (మిగతా 9వ పేజీలో..)

బెల్టుకు అడ్డుకట్ట పడేనా?



- బెల్టుషాపులపై కఠినచర్యలకు సీఎం ఆదేశం
- నిర్వాహకులపై పీడీ యాక్ట్ నమోదు
- సన్నద్ధమవుతున్న యంత్రాంగం
- వివరాల సేకరణలో బిజీ

మెంటాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం బెల్టుషాపుల నిర్వాహకులపై పీడీ యాక్ట్ తెరవాలని సాక్షాత్తు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మరోసారి ఆదేశించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఎక్సైజ్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు. దీంతో ఎక్సైజ్ యంత్రాంగం చర్యలకు సన్నద్ధమవుతోంది. గ్రామాలవారీ గొలుసు దుకాణాల వివరాల సేకరణకు సమాయత్తమవుతోంది. ముందస్తుగా బెల్టు నిర్వాహకులకు హెచ్చరికలు జారీచేస్తారు. అప్పటికీ మొండిగా ముందుకువెళ్తే వారిపై పీడీ యాక్ట్ తెరవనున్నారు. బెల్టుషాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు గతంలో ఆదేశాలు జారీచేశారు. కానీ అమలు చేయడంలో ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. తాజా ఆదేశాలతోనైనా బెల్టుపై చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.



మద్యం వ్యాపారుల సిండికేట్..

జిల్లాలో ఎక్కడికక్కడే బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. కొందరు మద్యం వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి దందా కొనసాగిస్తున్నారు. పల్లె, పట్టణ ప్రాంతాలు అనే తేడా లేకుండా బెల్టు షాపులు నిర్వహిస్తూ మందుబాబుల జేబులను గుల్ల చేస్తున్నారు. గ్రామాల్లో బెల్టు దుకాణాల ద్వారానే మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. కొన్నిచోట్ల పోటాపోటీగా ఆ షాపులను ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాలతో పాటు ప్రధాన గ్రామాల్లో ఎక్కడికక్కడే బెల్ట్ షాపులు కనిపిస్తున్నాయి. సిండికేట్‌లు ఒక్కో బాటిల్‌పై రూ.ఐదు నుంచి రూ.పది అదనంగా ఇచ్చి మద్యం కొనుగోలు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఒక బాటిల్‌పై అదనంగా రూ.20 నుంచి రూ.30 పెంచి అమ్మకాలు చేపడుతున్నారు. కొన్నిసార్లు డిమాండ్‌ను బట్టి రూ.50 అదనంగా వసూలు చేస్తున్న సందర్భాలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఏ సమయంలోనైనా మద్యం దొరుకుతుంది. బెల్ట్ నిర్వాహకులు లైసెన్స్ దుకాణాల్లో మద్యం సీసాలను కొనుగోలు చేసి ద్విచక్ర వాహనాలపై గ్రామీణ ప్రాంతాలకు తీసుకొని వచ్చి విక్రయాలు చేపడుతున్నారు. కొన్ని గ్రామాల్లో రెండు నుంచి మూడు వరకు మద్యం బెల్టు దుకాణాలు ఉన్నాయి. వీటికోసం బహిరంగ వేలంపాటలు కూడా జరుగుతున్నాయి. మొదట్లో కాస్త హడావుడి చేసిన ఎక్సైజ్ యంత్రాంగం క్రమంగా పట్టించుకోవడం మానేసింది. ప్రభుత్వం మద్యం వ్యాపారులకు టార్గెట్‌లు విధించడం, అవసరం లేకున్నా పర్మిట్ రూమ్‌లను బలవంతంగా ఏర్పాటు చేయిస్తుండడంతో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు సర్దుకుపోతున్నారు. దీంతో పాత వాటికి తోడుగా కొత్తగా ఎక్కడికక్కడ పుట్టగొడుగుల్లా బెల్టు దుకాణాలు పుట్టుకొస్తున్నాయి. వైన్ షాపుల యజమానులు అమ్మకాలు పెంచుకోడానికి ప్రత్యేక ఏర్పాట్లతో బెల్టుషాపులకు డోర్ డెలవరీ కూడా చేస్తున్నారు.

నకిలీ మద్యంతో గుబులు

రాష్ట్రంలో కొన్నిచోట్ల నకిలీ మద్యం (మిగతా 9వ పేజీలో..)

పాడి రైతులకు అండగా

- పశువుల షెడ్ల నిర్మాణానికి నిధులు
- రూ.9.45 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- మొదటి విడతగా 521 షెడ్లు కట్టేందుకు చర్యలు



నెల్లిమర్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పశువుల షెడ్ల నిర్మాణానికి రాయితీతో నిధులిస్తూ అండగా ఉంటుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.9.45 కోట్ల అంచనాతో మొదటి విడతగా 521 మూగజీవాల షెడ్లు నిర్మించనున్నారు. జిల్లాలో 14 మండలాలకు ఈ నిధులు మంజూరు చేస్తూ పథకం జిల్లా సమన్వయకర్త, కలెక్టర్ ఎం.రామసుందర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వీటిలో పశువుల షెడ్లు 505, మేకలు/గొర్రెల షెడ్లు 9, కోళ్ల ఫారాల షెడ్లు 7 కేటాయించారు. రెండు పశువులు ఉన్న షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షలు, నాలుగుంటే రూ.1.85 లక్షలు, ఆరుంటే రూ.2 లక్షలు, 50 మేకలు/గొర్రెల షెడ్ నిర్మాణానికి రూ.2 లక్షలు, 200 కోళ్ల షెడ్‌కు రూ1.32 లక్షల చొప్పున మంజూరు చేశారు. ఈ పథకం (మిగతా 9వ పేజీలో..)

నిధులు మంజూరు ఇలా..

నియోజకవర్గం	షెడ్లు	నిధులు రూ.కోట్లలో
రాజాం	120	2.06
గజపతినగరం	47	0.83
బొబ్బిలి	169	3.07
ఎస్.కోట	14	0.26
చీపురుపల్లి	108	2.06
నెల్లిమర్ల	63	1.14

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

- పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలి
- కలెక్టర్ రామసుందర్‌రెడ్డి



సత్కారం పొందిన పారిశుధ్య కార్మికులతో కలెక్టర్ రామసుందర్‌రెడ్డి తదితరులు

విజయనగరం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ తలో మొక్కను నాటి సంరక్షణ చేపట్టాలని కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు గాంధీ విగ్రహం వద్ద శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు కాలుష్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు. భావితరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించే దిశగా కృషి చేయాలన్నారు. నగరంలో 50వేల పండ్ల మొక్కలు పంపిణీ చేయడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. అనంతరం (మిగతా 9వ పేజీలో..)

ఆగని ఇసుక తవ్వకాలు

- గోస్తనీ వంతెనకు పొంచి ఉన్న ముప్పు
- చోద్యంచూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు

8లో

తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వండి

- పురుగు మందు బాటిల్‌తో రామాపురం కాలనీ వాసి హల్‌చల్
- పార్వతీపురంలోని జ్యూయలర్ షాపు వద్ద హైడ్రామా

8లో

నేడు పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

8లో

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

షాపు పెట్టాలంటే ఇచ్చుకోవాల్సిందే!

- తాత్కాలిక బాణసంచా దుకాణాల అనుమతులకు అదనపు వసూళ్లు
- వ్యాపారులపై భారం
- బయట పడేందుకు వినియోగదారులపై బాదుడు

- గంట్యాడ మండలం బాణసంచా దుకాణం ఏర్పాటు చేసుకోవడానికి ఓ వ్యక్తి అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వ నిబంధనలు మేరకు అగ్నిమాపకశాఖకు రూ 500, పోలీసు శాఖకు రూ.500, రెవెన్యూ శాఖకు రూ.50 చొప్పున చలానా చెల్లించాడు. ఆ వ్యక్తి ప్రభుత్వానికి అధికారికంగా చెల్లించింది రూ1050. అయితే, అనుమతిపత్రాలు పొందడానికి మరో రూ.20 వేలు ఖర్చు అయినట్లు ఆయన వాపోతున్నాడు. అంతేకాకుండా దీపావళి సామగ్రిలో కొన్ని ఫ్యామిలీ ప్యాక్ బాక్సులు సంబంధిత అధికారులు డిమాండ్ చేసినట్లు తెలిసింది.
- జిల్లా కేంద్రంలోని కేఎల్‌పురం సమీపంలో తాత్కాలిక బాణసంచా షాపు ఏర్పాటు చేసుకోవడానికి ఓ వ్యాపారి అధికారులకు దరఖాస్తు చేసుకున్నాడు. ఆయనకు కూడా ప్రభుత్వానికి చెల్లించినా చలానా కంటే ఇతర ఖర్చులు దాదాపు రూ.30 వేలు అయ్యాయి.
- బొబ్బిలి పట్టణంలో కొంతమంది వ్యాపారులు కలిసి దాదాపు ఆరు తాత్కాలిక షాపులు ఏర్పాటుకు అనుమతి పొందారు. ఈ వ్యాపారులు కూడా ప్రతి షాప్‌నకు రూ.25వేల నుంచి రూ30 వేలు చొప్పున అధికంగా ఖర్చు పెట్టినట్లు తెలిసింది.


జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక బాణసంచా షాపులు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇటువంటి పరిస్థితి జిల్లాలో చాలాచోట్ల ఉంది. ప్రతి మండలంలో మూడు నుంచి ఐదు తాత్కాలిక బాణసంచా షాపుల ఏర్పాటుకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఈ మేరకు సంబంధిత వ్యాపారులు శనివారం షాపులు పెట్టుకుని విక్రయాలు ప్రారంభించారు. ఆది, సోమవారాల్లో కూడా విక్రయాలు చేపట్టనున్నారు. జిల్లా కేంద్రంలో లైసెన్స్ షాపులు సుమారు 12 వరకూ ఉండగా, తాత్కాలిక షాపులు 56 వరకూ ఉన్నాయి. పట్టణంలోని కేఎల్ పురం వద్ద ఎక్కువగా తాత్కాలిక షాపులను ఏర్పాటు చేశారు. సాధారణంగా తాత్కాలిక దుకాణం ఎవరైనా పెట్టాలంటే ముందుగా వారు తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఎక్కడైతే షాపు ఏర్పాటు చేస్తారో? ఆ స్థలానికి సంబంధించిన 1బీ, ఆధార్ జిరాక్స్‌ను దరఖాస్తుకు జత చేయాలి. తరువాత అగ్ని మాపక శాఖకు రూ.500, పోలీసు శాఖకు రూ.500, రెవెన్యూ శాఖకు రూ.50 చొప్పున చలానా తీయాలి. పోలీసు, అగ్ని మాపక శాఖ అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి అనుమతి ఇస్తారు. మండల రెవెన్యూ అధికారులు రెవెన్యూ డివిజన్ అధికారికి పంపిస్తారు. అక్కడ అనుమతి పొందిన తరువాత షాపును వారు ఎంచుకున్న స్థలంలో ఏర్పాటు చేసుకోవచ్చు. మొత్తంగా చలానా, ఆన్‌లైన్ తదితర (మిగతా 9వ పేజీలో..)

రూ.850 కోట్ల లింకేజీ రుణాల లక్ష్యం

- డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14,082 స్వయం సహాయక సంఘాల్లోని 80,135 మంది సభ్యులకు ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.850 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందించాలన్నదే తమ లక్ష్యమని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసపాణి తెలిపారు. బొబ్బిలిలో లింకేజీ రుణాలపై బ్యాంకు అధికారులతో ఆయన శనివారం చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి డిజిటల్ మైక్రో క్రెడిట్ ప్లాన్ (డీఎంసీపీ) ద్వారా రుణాలను అత్యంత పారదర్శకంగా అందజేస్తున్నట్లు తెలిపారు. బహుళ సంఘాల్లో సభ్యత్వాలను నివారించడం, రుణవితరణలో అక్రమాలు, లోపాలు లేకుండా ఉండేందుకు ఈ నూతన పద్ధతి దోహదపడుతుందని అన్నారు. గత నెలాఖరు వరకూ 4,173 గ్రూపులకు చెందిన 52,162 మంది సభ్యులకు రూ.426 కోట్లు లింకేజీ రుణాలను అందజేసినట్లు (మిగతా 9వ పేజీలో..)


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసపాణి

బస్సులు కిటకిట.. రైళ్లలో రద్దీ

- దీపావళికి స్వస్థలాలకు చేరుతున్న ఉద్యోగులు, వలస కూలీలు

8లో


విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జనాల రద్దీ

ఆగని ఇసుక తవ్వకాలు

- గోస్తనీ వంతెనకు పొంచి ఉన్న ముప్పు
- చోద్యంచూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు



గోస్తని నదిలో ముషిడిపల్లి వద్ద జాతీయరహదారిపై ఉన్న వంతెనకు ఆనుకుని యంత్రంతో ఇసుకతవ్వుతున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి వద్ద గోస్తనీ నదిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వంతెన వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎటువంటి అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు పగటిపూట యంత్రాలతో తవ్వి ఇసుకతరలిస్తున్నారు.ఇక్కడ ఇసుక,మట్టిని ట్రాక్టర్లతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో భవన నిర్మాణాలకోసం డెవలపర్లకు విక్రయిస్తున్నారు. ఇక్కడ చత్తీస్‌ఘడ్ వెళ్లే జాతీయ రహదారి నిర్మాణం ఏడాది కిందటే పూర్తయ్యింది. ముషిడిపల్లి వద్ద కొత్తగా ఎన్‌హెచ్‌పై నిర్మించిన వంతెనకు ఆనుకుని 500 మీటర్లలోపే ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదం పొంచిఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.భారీవర్షాలు కురిస్తేవంతెన కోతకు గురయ్యే ప్రమాదముందన్న భయాందోళన నెలకొంది. గోస్తనినది నుంచిజిల్లాలోని జామి, ఎస్.కోట, గంట్యాడ, విశాఖ జిల్లాలోని రెడ్డిపల్లి, పద్మనాభం తదితర మండలాల్లో 11 వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. అలాగే జీవీఎంసీతోపాటు విజయనగరం నగరపాలక సంస్థకు తాగునీరందించే ఇన్‌ఫిల్టర్ బావులు కూడా నదిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలో ఉన్నాయి. నిత్యం ఇసుకతవ్వకాల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోయివేసవిలో నీటిలభ్యత తగ్గి నగరాలకు తాగునీటిముప్పుపొంచిఉందన్న ఆందోళనవ్యక్తమవుతోంది. ఇసుక తవ్వకాలపై పర్యవేక్షించి అడ్డుకోవల్సిన రెవెన్యూ,మైనింగ్, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తుండడంతో విమర్శలొస్తున్నాయి. కాగా ముషిడిపల్లి వద్ద గోస్తనీ నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తామని ఇరిగేషన్ ఏఈ శంకర్ తెలిపారు.

తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వండి

- పురుగు మందు బాటిల్‌తో రామాపురం కాలనీ వాసి హల్‌చల్
- పార్వతీపురంలో శ్రీ స్వామి జ్యూయలర్ షాపు వద్ద హైడ్రామా



జ్యూయలర్ షాపు వద్ద నిరసన తెలుపుతున్న విజయ్ కుటుంబసభ్యులు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టిన బంగారం తిరిగి ఇవ్వాలని పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన కోట విజయ్ డిమాండ్‌చేశాడు. పట్టణంలోని ప్రధాన రహదారిలోగల శ్రీస్వామి జ్యూయలర్ దుకాణంలోకి వెళ్లి తాళాలు వేసి పురుగు మందు తాగేందుకు యత్నించాడు.దీంతో శనివారం స్వామిజ్యూయలర్స్ వద్ద హైడ్రామానడిచింది. బాధితుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామాపురం కాలనీకిచెందిన కోట విజయ్ పట్టణ ప్రధాన రహదారిలోగల శ్రీ స్వామి జ్యూయలర్స్‌యజమాని గెంబలి శంకరరావువద్ద అవసరాల నిమిత్తం 2019లో 30 తులాల బంగారం తాకట్టు పెట్టాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోలేకపోయాడు. ఇంతలో జ్యూయలర్స్ షాపు యజమాని శంకరరావు కరోనా బారినపడి మృతిచెందారు. దీంతో జ్యూయలర్స్ షాపు యజమాని కుమారులు పృథ్వీరాజ్, వినయ్‌కుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు తాను బంగారం తాకట్టు పెట్టిన విషయం విజయ్ చెప్పాడు.అయితే శంకరరావు కుమారులు ఇదిగో, అదిగో ఇస్తామంటూ రెండేళ్లపాటు తిప్పించుకున్నారు.చివరకుపెద్ద మనుషుల వద్ద విజయ్ పంచాయితీ పెట్టాడు. శ్రీస్వామి జ్యూయలర్స్ నుంచి 15 తులాలు ఇప్పించేందుకు పెద్ద మనుషులు మాటిచ్చారు. కానీ నాకు న్యాయం జరగకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో విజయ్ ఫిర్యాదుచేశాడు. అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో శనివారం జ్యూయలర్ షాపునకు వచ్చిన విజయ్ లోపలకు వెళ్లి తాళాలువేశాడు. పురుగు మందు తాగేందుకు యత్నించాడు. విషయం తెలుసుకున్న విజయ్ భార్యశ్రీదేవి, కూమార్తె సాయిరూపలతో పాటు ఆయన కుటుంబ సభ్యులు షాపు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం పట్టణ సీఐ మురళీధర్ వద్ద ప్రస్తావించగా బాధితుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు. అయితే బాధితుడు విజయ్ శ్రీస్వామి జ్యూయలర్స్ వద్ద బంగారం తాకట్టు పెట్టినట్టు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు.

నేడు పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

విజయనగరం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడిమాంబ దీక్షాదారుల ఆధ్వర్యంలో ఆదివారం కలశజ్యోతి ఊరేగింపుకార్యక్రమం జరగనుంది. రైల్వేస్టేషన్ రోడ్డులో గల వనంగుడి వద్ద ప్రారంభమై, వైఎస్సార్ జంక్షన్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, డాబాగార్డెన్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, అక్కడి నుంచి గంటస్తంభం మీదుగా మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడికి చేరుకోనుంది. ఈమేరకు కలశ జ్యోతి ఊరేగింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నేడు తిలతైలాభిషేకం

శృంగవరపుకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట పుణ్యగిరి దిగువన గల పుణ్యతిరుమల గిరిక్షేత్రంలో ఆదివారం ఉదయం ఐదుగంటలకు పద్మావతిగోదా సమేత వేంకటేశ్వర స్వామికి తిలతైలాభిషేకం జరగనుంది. ఉదయం తొమ్మిది గంటలకు ఉత్సవమూర్తుల ఆలయ ప్రదక్షణ, స్వామివారి ఆస్థాన మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు పురుషోత్తమ్ తెలిపారు.

నేడు మంత్రి దుర్గేష్ పర్యటన

రాజాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజాంలో రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పర్యటించనున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒకప్రకటనలో తెలిపారు. రాజాం కళాకారులు నిర్మించిన జీఎంఆర్ వరలక్ష్మి ఆడిటోరియం వేదికను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాల నాయకులతోపాటు మునిసిపాలిటీలోని టీడీపీ,కూటమి నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎంసీ సభ్యుల కోసం పేర్లు నమోదు చేసుకోండి

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో రాజీకి వీలయ్యే కేసులను రాజీ చేసేందుకు ఏర్పాటుచేసిన మధ్యవర్తిత్వం కమిటీ(ఎంసీ) సభ్యులుగా ఆసక్తి గల న్యాయవాదులు పేర్లను నమోదు చేసుకోవాలని కొత్తవలస న్యాయాధికారి డాక్టర్ విజయ్ చందర్ తెలిపారు. శనివారం కొత్తవలస కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం కమిటీ సభ్యులుగా న్యాయవాదులను నియమించి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజీకి వీలు అయ్యే కేసులను ముందుగా మీడియేషన్ కమిటీకి పంపించి అక్కడరాజీ జరిగిన తర్వాత లోక్ అదాలత్‌లోరాజీచేయనున్నట్లు పేర్కొన్నారు.

దోచుకోవడమే నాయకుల పని

బొండపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మాజీఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ఆరోపించారు.శనివారం గొట్లాంలో మండల స్థాయి వైసీపీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలంనాయుడు, చిన్నంనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లపై విచారణ

రేగిడి, అకోబరు 18,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిశలో ఏడుగురు బోగస్ పింఛన్లు అందుకుంటున్నరన్న ఫిర్యాదుపై ఎంపీడీవో శ్యామలాకుమారి ఆదేశాల ప్రాప్తికి ఎంఈవో వరప్రసాదరావు శనివారం సచివాలయంలో విచారణ నిర్వహించారు. ఈమేరకు గ్రామానికి చెందిన పైల బాలరాజు, లావేటి లక్ష్మణతో పాటు మరో ఐదుగురు తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు అందుకుంటున్నరని అదేగ్రామానికి చెందిన డి.గౌరినాయుడు ఇటీవల ఫిర్యాదుచేశాడు.ఈమేరకు విచారణకు అభియోగ పింఛనదారులు గైర్హాజరయ్యారు. గౌరినాయుడు విచారణకు హాజరై తన ఫిర్యాదుని వెనక్కి తీసుకొన్నట్లు పేర్కొని రాతపూర్వకంగా విత్‌డ్రా చేసుకుంటున్నట్లు తెలియజేశారని ఎంఈవో తెలిపారు.

నాణ్యమైన బోధన లక్ష్యం కావాలి

ఉపాధ్యాయులకు నాణ్యమైనబోధన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి లక్ష్యంగా ఉండాలని ఎంఈవో-1, 2లు వరప్రసాదరావు,బి.ఎరకయ్యలు పేర్కొన్నారు.రేగిడి మండలంలోని కందిశ, లింగాలవలసలో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈవో-1, 2లు వేర్వేరుగా పరిశీలించారు. అలాగే సంకిలి, ఏవీపురం, ఖండ్యాం తదితర పాఠశాలల్లో స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు చైర్మన్లు నిర్వహించారు.

మండల సర్వేయర్‌గా శివాజీ

భోగాపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండల సర్వేర్‌గా జి.శివాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మండల సర్వేయర్ మధుకేశవరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో విజయనగరంలో విధులు నిర్వహిస్తున్న శివాజీని ఇక్కడ మండల సర్వేయర్‌గా నియమించారు.

బస్సులు కిటకిట.. రైళ్లల్లో రద్దీ

- దీపావళికి స్వస్థలాలకు చేరుతున్న ఉద్యోగులు, వలస కూలీలు



విజయనగరం బస్టాండ్‌లో బస్సెక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, ఎస్.కోట, చీపురుపల్లి తదితర రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు శనివారం కిటకిటలాడాయి. దీపావళి పురస్కరించకుని వివిధ ప్రాంతాల్లోగల ఉద్యోగులు, వలస కూలీలు స్వస్థలాలకు రెండు రోజుల ముందుగానే చేరుకుంటున్నారు. దీంతో శనివారం తెల్లవారి నుంచే హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లన్నీ రద్దీగా ఉన్నాయి. నగర, పట్టణ ప్రాంతాలన్న తేడాలేకుండా దీపావళిని కుటుంబ సభ్యులతో ఆనందంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లుచేసుకున్నారు. ఆదివారం,సోమవారం దీపావళి నేపథ్యంలో వరుస సెలవులు కావడంతో విజయనగరం నుంచి కూడా ఎక్కువ మంది తమ, తమ సొంత ప్రాంతాలకు బయలు దేరి వెళ్లారు.రైల్వే, బస్సు స్టేషన్‌ల్లో ప్రయాణికులు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటలకొద్దీ వేచిఉండాల్సివచ్చింది.

పర్యావరణ దీపావళిపై అవగాహన

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాం ప్రభుత్వోన్నతపాఠశాలలో శనివారం పర్యావరణ దీపావళిపై ఇన్‌చార్జి హెచ్‌ఎం రహీంషేక్ లాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్థులకు అవగాహన కల్పించారు. శబ్ద, వాయుకాలుష్యం వలన కలిగే అనర్థాలు వివరించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కలిగించే విధంగా ఎలా దీపావళి చేసుకోవాలో వివరించారు.

ప్రతి ఇంటా వెలుగులు నిండాలి: మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకొనే దీపావళి వెలుగు,సంతోషం, ఐక్యత, ఆనందం నింపే పండుగని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వెలుగు, ఆనందం, సుఖకాంతులు నిండాలని ఆశిస్తూపర్యావరణ హితంగా టపాసులుపేల్చి పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బాణసంచా విక్రయ స్థల పరిశీలన

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి హెచ్చరించారు. శనివారం చింతలపాలెం గ్రామ రెవెన్యూపరిధిలోని సర్వేనెంబరు 32-2,3ల్లో దీపావళి టపాసులు విక్రయించేందుకు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి స్థలాన్ని ఆమె పరిశీలించారు.ఈసందర్భంగా 516 బీ జాతీయరహదారి కోసం ఆస్తులను కోల్పోతున్న బాధితుల వివరాలను త్వరగా తయారుచేయాలని రెవెన్యూశాఖ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని రాజాంటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిల్వచేసినా, విక్రయించినా సీజ్‌చేస్తామని పేర్కొన్నారు.రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి లైసెన్స్ తీసుకున్న వారే అమ్మకాలు చేయాలని తెలిపారు. గ్రామాలు, కాలనీల్లో ఇళ్లదగ్గర, పట్టణంలో నాలుగుచక్రాల బళ్లు, బడ్డీల్లో అమ్మేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తారాజువ్వల పోటీల ముసుగులో ఇబ్బందిపెట్టవద్దు

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల్లో భాగంగా తారాజువ్వలు పోటీల ముసుగులో సామాన్య ప్రజలను ఇబ్బందులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గణేష్ హెచ్చరించారు. జరజాపుపేట, రామతీర్థం జంక్షన్, మొయిదజంక్షన్, నెల్లిమర్ల కొన్ని ప్రాంతాల్లో ఆకతాయిలు తారాజువ్వల పోటీలు పేరుతో వాటిని ఒకరిపై ఒకరు విసురుకొని, ఆ వీధుల్లో గల సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని ఎస్‌ఐ గణేష్ తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారంచర్యలు ఉంటాయని హెచ్చరించారు.స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగితే జైలుకు కూడా పోయే పరిస్థితి ఏర్పడవచ్చని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



సారిపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న లోకం నాగమాధవి

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు.శనివారం మండలంలోని సారిపల్లి గ్రామంలో మనప్రజలతో -మన ఎమ్మెల్యే కార్యక్రమంలోభాగంగా గ్రామస్థులతో మాట్లాడారు.ఈసందర్భంగా స్థానికులు గ్రామంలోని డ్రైనేజీ సమస్యలు, రోడ్లదుస్థితిని ఆమెకు వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఉమ్మడివ్యూహంతో ముందుకువెళ్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్ల వెంకటరావు, టీడీపీ నాయకులు బి.ఆదినారాయణ, సారిపల్లి బాబురావు, వెంకటరావు, గోపాలమూర్తి, జనసేన పార్టీ నాయకులు మజ్జి రామారావు, కరమజ్జి గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి: డీపీవో

గజపతినగరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): చెత్తసంపద కేంద్రాల్లో వర్మికంపోస్టు తయారుచేసి పంచాయతీలకు ఆదాయ వనరులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని డీపీవో డి.మల్లిఖార్జునరావు తెలిపారు. శనివారం గజపతినగరం చెత్తసంపద కేంద్రం వద్ద శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జనార్దనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను వేరు చేయడంపై అవగాహన

రాజాం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోపేరులో చెత్తను వేరు చేయడంపై శనివారం ఎంపీడీవో జె.ఆనందరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద సీఆర్పీలకు,క్లాప్‌మిత్రలకు తడిచెత్త పొడిచెత్త వేరుచేసేవిధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన సీఆర్పీలు కేటాయించి 1000 కుటుంబాలకు గాను రోజుకు 50 కుటుంబాలు చొప్పున ఇంటింటికి వెళ్లి 20 రోజులపాటు అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలకు చెందిన మహిళా సంఘాలు, రిసోర్స్‌పర్సన్ సుప్రియ, ఎంపిడీవోలు పాల్గొన్నారు.

అర్హులందరికీ డ్రిప్ ఇరిగేషన్: పీడీ

వేపాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద బిందు సేద్యం వ్యవసాయ పరికరాలను అందజేయనున్నట్లు జిల్లా ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని వీలుపర్తిలో ఓ రైతు మైక్రో ఇరిగేషన్ పథకంలో భాగంగా సాగుచేసిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదెకరాల్లోపు ఉన్న షెడ్యూల్ కులాల వారికి 100 రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. వీరికి గరిష్టంగా 2.18 లక్షల ప్రోత్సాహం అందజే యనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి



ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

బొండపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని సాయి సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ శీరంరెడ్డి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం బొండపల్లిలోని ఓ ప్రైవేటు హాలులో ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు.ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే ముఖ్యం కాదని, అలాగని చదువును నిర్లక్ష్యంచేయరాదని చెప్పారు. తమకు ఇష్టమైన రంగాలను గుర్తించుకొని ముందుకుసాగితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ ఏవో గౌరినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

104 ద్వారా మెరుగైన సేవలు

డెంకాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 104 వాహనం ద్వారా మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి ఎన్టీఆర్ ట్రస్టు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరామ్, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ నరసింహమూర్తి సూచించారు. శనివారం మండలంలోని మోపాడ పీహెచ్‌సీ పరిధిలో జొన్నాడ పంచాయతీ దువ్వపేటలో 104 వాహనంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో సంతోష్, డ్రైవర్ మధు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

డెంకాడలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ దాట్ల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో దాట్ల శ్రీకాంత్‌బాబు,వైద్యులు బి.శ్రీను, పి.శైలజ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం,దాట్ల సత్యనారాయణ, డి.ప్రదీప్‌రాజు, సిరికి అప్పారావు, రంగారాజు, విజయరామరాజు, బుజ్జి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం టౌన్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్త అగ్రహారం నీళ్ల ట్యాంకు పంపింగ్ వాల్ పాడవడంతో రెండురోజులపాటు తాగునీరు పంపిణీకి అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మరమ్మతులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు. ట్యాంకు పరిధిలో ఉన్న లంకాపట్నం,నాగవంశం వీధి, పుచ్చలవీధి, హుకుంపేట, బూర్లిపేట, కొత్తఅగ్రహారం,ఉల్లివీధి, వైష్ణవవీధుల్లోని స్థానికులు గమనించి సహకరించాలని కోరారు.

వాయు కాలుష్యం తగ్గించాలి: ఎంపీడీవో

భోగాపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని వాయు కాలుష్యన్ని తగ్గించేలాచర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డి.స్వరూపరాణి కోరారు. శనివారం భోగాపురంలో కాలుష్యనివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ప్రతిజ్ఞచేయించి, మానవహారం, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు సైకిల్ ఉపయోగిస్తే వాయుకాలుష్యం తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గాయిత్రి, నాయకులు కె.సుభోషణరావు, ఆళ్ల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాథు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో డీఎన్‌ఏ కీలకం

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):సాధారణ ప్రకృతి విపత్తులు లేదా వివిధ సంక్లిష్ట నేరాలలో మానవదేహాలను గుర్తించేందుకు, నేర పరిశోధనకు డీఎన్‌ఏ ఆధారం కీలకమని హైదరాబాద్ బ్రిక్-సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్ (సీడీఎఫ్‌డీ) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.మధుసూదనరెడ్డి తెలిపారు. శనివారం సెంచూరియన్‌విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్స్ ఇన్‌డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్ అన్న అంశంపై మాట్లాడారు.డీఎన్‌ఏ విషయంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, ఫోరెన్సిక్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ రవికుమార్, అసోషియేట్ ప్రొఫెసర్ హైరాక్‌దాస్, విభాగాధిపతి డాక్టర్ నాగజోగయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పేరిట వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు.శనివారం రాజాంలో ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంపదపై ప్రైవేటు పెత్తనమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న పది మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధంకావడాన్ని తప్పుపట్టారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందాలంటే కళాశాలలను ప్రభుత్వరంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి: ఏడీఏ

నెల్లిమర్ల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. నెల్లిమర్ల వ్యవసాయ కార్యాలయంలో ఏవో శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈవోలు, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ డేటా బుకింగ్ చేయాలని ఆదేశించారు.

నమ్మించి గొంతు కోశారు

- బొడ్డవరలో 120వ రోజుకు చేరిన నిర్వాసితుల దీక్షలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ సమయంలో అప్పటి కలెక్టర్, జేసీ, ఆర్డీవోలు మీకు మేము అండగా ఉంటామని నమ్మించి మా గొంతు కోశారని జిందాల్‌నిర్వాసితులు వాపోయారు. తమకు న్యాయంజరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. శనివారానికి బొడ్డవరలో చేపట్టిన రిలేదీక్షలు 120 రోజుకు చేరాయి.ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమభూముల్లో అక్రమంగా ప్రవేశించి వాల్టా చట్టం ఉల్లఘించి పండ్లతోటలు, పంటలు నాశనంచేస్తున్న జిందాల్ యాజమాన్యాన్ని ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం అరెస్ట్‌చేయాలని కోరారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కురుపాం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పూతికవలస సమీపంలో శనివారం రాత్రి గొరడ నుంచి కర్రలతో వెళ్తున్న ట్రాక్టరును బైక్‌తో వెనుక నుంచి పూతికవలసకు చెందిన రైతు గొట్టాపుగౌరినాయుడు(55) ఢీకొన్నాడు. దీంతో ఆయన తలపై బలమైన గాయమైంది. విషయం గమనించిన స్థానికులు కురుపాం ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే గౌరినాయుడు మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదుచేశారు.

రైలు నుంచి జారిపడి ఛత్తీస్‌గడ్ వాసి..

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలో శనివారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి ఛత్తీస్‌గడ్ వాసి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్ జిల్లా పటాన్ ప్రాంతంలోని భిలాయ్ చరోడాగ్రామానికి చెందిన ఓంప్రకాశ్‌యాదవ్ (30) శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి రైలులో ప్రయాణిస్తూ స్థానిక ఇందిరమ్మకాలనీ రైలు పట్టాల దగ్గర రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.మృతుడి తండ్రి ఉదయ్ సింగ్ యాదవ్‌కు సమాచారం అందించామని హెచ్‌సీ తెలిపారు.

మృతుడి ఆచూకీపై సమాచారం ఇవ్వండి

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరావుపల్లికి చెందిన తిరుపతి చెరువులో శుక్రవారం గుర్తించిన మృతుడి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు ఒక ప్రకటనలో కోరారు. సీఐ కథనం మేరకు..మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుంది. 5.5 అడుగుల ఎత్తు ఉండి చామన చాయ రంగు కలిగిఉంటాడు. నలుపురంగు హాఫ్ హ్యాండ్స్‌షర్టు నలుపురంగు ట్రాక్ ధరించాడు. ఈమేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి శృంగవరపుకోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సమాచారం తెలిస్తే 9121109421, 9121109452 నంబర్లకు తెలియచేయాలి.

గంజాయి నిందితులకు రిమాండ్


కొమరాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):కూనేరు చెక్‌పోస్టు వద్ద ఆగస్టు 10న చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయితో పట్టుబడిన కేసులో ఒడిశాలోని కందమూల్‌జిల్లా బాలిగృహ బ్లాక్ తంగేరిగ్రామానికి చెందిన దిలీప్, మల్లిక్‌లను శనివారం అరెస్టు చేశామని కొమరాడ పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ కె.నీలకంఠం తెలిపారు.వారిని పార్వతీపురం జూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా వారికి న్యాయాధికారి రిమాండ్ విధించారని ఎస్‌ఐ వివరించారు.

భూమి స్వాధీనంపై ఇరువర్గాల వాగ్వాదం

లక్కవరపుకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద గల సుమారు 30 సెంట్ల భూమి వివాదంపై ఉత్కంఠ వీడింది. ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి వైసీపీకి చెందిన ఓ నేత నుంచి భూమిని స్వాధీనంపరుచుకుంటున్న సందర్భంలో శనివారం వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు..ఆర్జీపేటకు చెందిన జీవీఎస్ రాముకు 1990లో డాక్యుమెంట్ నెంబరు 542 ద్వారా గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో సుమారు 30 సెంట్ల స్థలం దఖలుపడింది.ఈ భూమిపై అదేగ్రామానికి చెందిన పినిసెట్టి కిష్టమ్మ దొర కోర్టులో కేసువేశారు.టైటిల్ నిరూపించుకోకపోడంతో కోర్టు ఆ కేసును డిస్మిస్‌చేసింది. దీంతో సంబంధిత స్థలాన్ని హక్కుదారుడు రాము లెవిల్ చేస్తుండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

వైసీపీ నేతల కక్ష సాధింపు

- ఇంటి నుంచి బయటకు రానీయకుండాఇనుపకంచె ఏర్పాటు
- అలమండలో వీధి రోడ్డుపై మట్టిపోసిన వైనం



ఇంటి నుంచి బయటకు రాకుండా ఏర్పాటుచేసిన ఇనుప కంచె

జామి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండకు చెందిన రెండు ముస్లిం కుటుంబాలపై వైసీపీ నాయకుల కక్షసాధింపు చర్యలకు దిగారు. వారిని ఇంటి నుంచి బయటకు రానీయకుండా ఇనుప కంచెను ఏర్పాటుచేయడంతో పాటు ఆ వీధి రోడ్డుపై మట్టి పోగులు పోశారు. వైసీపీ నేతల నుంచి తమకు ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని గ్రామానికి చెందిన మైనార్టీ కుటుంబపెద్దలు షేక్‌మస్తాన్‌బీబీ, షేక్ పీర్ సాహెబ్ కోరుతున్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. 'మేము గతంలో వైసీపీలో ఉండేవాళ్లం. ఆ పార్టీ పద్ధతులు నచ్చక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాం. అప్పటినుంచి గ్రామంలోని వైసీపీ ప్రధాన నేతలు మాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. మా ఆస్తులు ధ్వంసంచేసే కుట్ర చేస్తున్నారు. అనుక్షణం మాపై దాడికి యత్నిస్తున్నారు. ఈవిషయంపై ఇప్పటికే పలు మార్లు ఎస్పీ, జామి పోలీసులకు ఫిర్యాదుచేశాం. అయినా వైసీపీ నేతలు వారం రోజుల కిందట మా సొంత స్థలాల్లో ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టనీయకుండా ఇనుప కంచెకట్టారు. వీధిలో పెద్దఎత్తున మట్టిపోసి మార్గాలు మూసేశారు. పోలీసులకు చెప్పడంతో వారు వచ్చి కొంతమేర ఇనుప కంచెను తీశారు. ఇంత దారుణంగా మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. వారి నుంచి కాపాడండి.' అని కోరుతున్నారు. ఈవిషయంపై సీఐ అప్పలనాయుడును వివరణ కోరగా.. 'గ్రామ సచివాలయంలో ఇరువర్గాలతో చర్చలు జరిపాం. ఎవరి హక్కులకు ఎవరు భంగం కగించినా ఉపేక్షించేది లేదు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తాం'. అని తెలిపారు. ఇదే విషయంపై అవతల వర్గం వారిని ప్రశ్నించగా.. మార్గమధ్యలో ముస్లింలు చికెన్ దుకాణం పెట్టారని, ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, అందుకే కంచె ఏర్పాటు చేశామని తెలిపారు.

'బెల్టు'కు అడ్డుకట్టపడేనా?

(7వ పేజీ తరువాయి)

బాగోతాలు బయటపడడం మందుబాబుల్లో గుబులు పుట్టిస్తోంది. అదే సమయంలో నకిలీ నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు కొంత ఉపశమనం కలిగిస్తున్నాయి. వైన్ షాపులవద్దే సులువుగా అసలు, నకిలీ నిగ్గుతేల్చే ఏర్పాట్లు చేయడంతో మద్యం ప్రియులు రిలాక్స్ అవుతున్నారు. ఇంకోవైపు ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు కూడా నకిలీ గుర్తింపునకు చేపడుతున్న విస్తృత చర్యలపై ప్రజల్లో మంచి అభిప్రాయం ఏర్పడింది. నకిలీ మద్యాన్ని తీవ్రంగా పరిగణించిన ముఖ్యమంత్రి చంద్రబాబు బెల్టుషాపుల నిర్వాహకులపై పీడీ యాక్ట్ తెరవడంతోపాటు నకిలీ మద్యం నిర్మూలనకు కఠిన ఆదేశాలను జారీచేశారు. వీటిలో మిగిలనవాటి విషయంలో యంత్రాంగం రాజీపడనప్పటికీ, గొలుసు దుకాణాల విషయంలో ఎంతమేర సక్సెస్ అవుతారనేది చూడాలి.

దొంగ.. దొంగా!

(7వ పేజీ తరువాయి)

ట్రాఫిక్ స్టేషన్లు ఉన్నాయి. బీ గ్రేడ్‌లో ఉన్న విజయనగరం స్టేషన్లలో సైతం అరకొరగానే సిబ్బంది ఉన్నారు. సీ గ్రేడ్‌లో ఉన్న రాజాం, బొబ్బిలి స్టేషన్లలో కూడా అదే పరిస్థితి. జిల్లా పోలీస్ శాఖలో మూడు సబ్ డివిజన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ, ముగ్గురు డీఎస్పీలు మొత్తంగా ఉన్నత పదవులు చేపట్టే అధికారులు శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. సీఐలు, ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు విధులు నిర్వహిస్తున్నారు. హోంగార్డులు కూడా సేవలందిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 14వేల మంది కానిస్టేబుల్ కొరత ఉన్నట్టు పోలీసు యంత్రాంగం చెబుతోంది. జిల్లాలో సుమారు వెయ్యి మంది కానిస్టేబుళ్ల కొరత ఉంది. కొత్త కానిస్టేబుళ్లు ఇప్పట్లో వచ్చే అవకాశం లేదు.

నిఘా ఎక్కడ?

జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారులు, కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్టు పోలీసు శాఖ చెబుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో వందలాది కెమెరాలు అమర్చినట్లు పోలీసులు చెబుతున్నారు. కానీ, ఇందులో చాలావారకు పనిచేయడం లేదు. నైట్ బీట్ కూడా తగ్గుముఖం పట్టింది. ప్రధాన రహదారుల్లో సైరన్‌తో చేతులు దులుపుకొంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. దారినిపోయే వాహనదారుల ఫొటోలు, ఫింగర్ ప్రింట్స్ తీసుకొని వదిలేస్తున్నారన్న అపవాదు ఉంది. ఇప్పటికైనా పోలీస్ శాఖ దృష్టిసారించాల్సిన అవసరముంది.

దృష్టిపెట్టాం..

జిల్లాలో దొంగతనాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాం. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. ప్రజలు కూడా సహకరించాలి. జాగ్రత్తలు పాటించాలి. ఇళ్లకు తాళాలు వేసి బయట ప్రాంతాలకు వెళ్తే విధిగా పోలీస్ స్టేషన్‌కు సమాచారమందించాలి. ఇంటర్ లాకింగ్ సిస్టంను వినియోగించుకోవాలి.

-ఏఆర్ దామోదర్, ఎస్పీ, విజయనగరం

పాడి రైతులకు అండగా

(7వ పేజీ తరువాయి)

లబ్ధిదారు పది శాతం వాటా భరిస్తే చాలు. 90 శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తుంది. దీనికోసం మండల స్థాయి ప్రోగ్రామ్ అధికారులు ఇప్పటికే లబ్ధిదారులను ఎంపిక చేశారు. పనులు వెంటనే ప్రారంభించి 2026 మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీటి నాణ్యతను క్వాలిటీ కంట్రోల్ బృందం ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

హాస్టళ్లలో వసతులపై దృష్టిసారించాలి

గజపతినగరం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): హాస్టళ్లలో వసతులు కల్పించేందుకు అధికారులు దృష్టిసారించాలని స్థానిక న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ కోరారు. శనివారం గజపతినగరంలోగల బాల, బాలికల వసతిగృహాలు, బాలసదనం వసతిగృహంలో తనిఖీ చేపట్టారు.ఆయన వెంట న్యాయవాది శేఖర్, వసతి గృహప్రత్యేక అధికారులు ఉన్నారు.





బాణసంచా దుకాణాల పరిశీలన


దుకాణాలను పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దారు

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను శనివారం ఆర్డీవో రామ్మోహనరావు, తహసీల్దారు మలపురెడ్డి శ్రీను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు ఉన్నదీ లేనిదీ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వ్యాపారులతో మాట్లాడారు. నిబంధనలు ఉల్లంఘించరాదన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని రకాల జాగ్రత్తలను పాటించాలని సూచించారు. అగ్ని నిరోధక పరికరాలు, నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని వ్యాపారులకు సూచించారు.

పాఠశాలల్లో స్వచ్ఛాంధ్ర బహిష్కరణ


నినాదాలు చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

రామభద్రపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నామని ఫ్యాప్టో నాయకులు జేసి రాజు, బొప్పె రవికుమార్, సుధాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో మూడో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అయితే ఉపాధ్యాయుల అత్యవసర డిమాండ్లు పీఆర్‌సీ, ఐఆర్‌డీఏలు, యాప్‌ల సమస్య వంటి డిమాండ్లు పరిష్కరించే వరకు దశల వారీగా పోరాటాలు చేస్తామన్నారు. మరుగుదొడ్ల పరిశీలన పత్రం, గూగుల్ పత్రాలను పంపించలేమని తేల్చి చెప్పారు. ఫ్యాప్టో రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు ప్రధానోపాధ్యాయులు ఈ విషయాలకు కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కర్రి శ్రీనివాసరావు, వేణుగోపాలరావు, లక్ష్మణరావు, వేణు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

క్రీడా స్ఫూర్తిని పెంపొందించండి



విజేతలతో డీఎస్పీ భవ్యారెడ్డి

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలని బొబ్బిలి అన్నారు. స్థానిక వీరబొబ్బిలి క్రీడా మైదానంలో స్పోర్ట్స్ రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు రావు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం చిల్డ్రన్స్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆమె విచ్చేసి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమన్నారు. పిల్లలను చదువుపై అవాంఛనీయమైన ఒత్తిడి తీసుకురావద్దని తల్లిదండ్రులకు హితవు పలికారు. వారిలో మానసిక పరిపక్వతకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుగ్గా పాల్గొనే అవకాశాలను కల్పించాలన్నారు. స్పోర్ట్స్ మీట్‌లో మొత్తం 800 మంది పిల్లలు పాల్గొన్నారు. 100, 400, మీటర్ల పరుగు పందెంలో 21 మంది చిన్నారులు విజేతలుగా నిలవడంతో వారందరికీ డీఎస్పీ భవ్యారెడ్డి బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిరిపురపు ప్రసాద్ పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రలో భాగస్వాములుకండి


మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో..

బొబ్బిలి రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్రలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో పి.రవికుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది స్వచ్ఛందంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. క్లీన్ ఎయిర్ నిమిత్తం కాంప్లెక్స్ ఆవరణలో ఆయా శాఖల అధికారులు మొక్కలు నాటారు. అనంతరం అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో భాస్కరరావు, ఏపీవో లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అలాగే పిరిడి, పారాది, పెంట, రంగరాయపురం తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంపై అవగాహన అవసరం

బొబ్బిలి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): వాయుకాలుష్యంపై ప్రజలకు అవగాహన అవసరమని మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు, కమీషనర్ లాలం రామలక్ష్మి అన్నారు. స్థానిక మున్సిపాలిటీలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవనం లక్ష్యంగా అందరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వాయు కాలుష్యం నేపథ్యంలో వాహనాలను వీలైనంత తక్కువగా వినియోగించాలని సూచించారు. కారు ఫ్రీ, బైక్ ఫ్రీ కార్యక్రమాలను ప్రోత్సహించాలన్నారు. సైక్లింగ్, నడకలను ప్రోత్సహించాలన్నారు. అనంతరం మున్సిపల్ అధికారులు, ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

సోలార్ సిస్టమ్, జీఎస్టీలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో

బొబ్బిలి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఎంపీడీవో రవికుమార్ ఆధ్వర్యంలో సోలార్ సిస్టమ్, జీఎస్టీలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోలార్ విద్యుత్ వినియోగంతో కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఇందుకోసం క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాలకు చెందిన ఆర్పీలు ప్రచారం చేయాలన్నారు. అలాగే జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించారు. ధరల తగ్గుదలను వివరించారు. కార్యక్రమంలో టీపీఆర్‌వో జగన్మోహన్, సీవోలు, ఆర్పీలు పాల్గొన్నారు.

హరిత దీపావళిని జరుపుకోండి

బొబ్బిలి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని హరిత దీపావళిగా అందరూ జరుపుకోవాలని గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎస్‌వీ రమణమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ కూడలిలో శనివారం రాత్రి వాల్ పోస్టర్ల ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణంలో నానాటికీ కాలుష్యం పెరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో బాణసంచాను విచక్షణారహితంగా కాల్చవద్దని హితవు పలికారు. సంప్రదాయం ప్రకారం దీపావళిని ఆనందంగా, సంతోషంగా జరుపుకోవాలన్నారు. కాలుష్య రహిత సామగ్రిని వాడాలని సూచించారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్తలు కె.విజయగౌరి, కృష్ణదాసు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

రామభద్రపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి యత్నించడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనను ప్రతీ ఒక్కరూ ఖండించాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0పై చేస్తున్న ప్రచారంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యావసర ధరలు, ఇతర వస్తువులు తగ్గింపులో ఎటువంటి వ్యత్యాసాలు లేవన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పేదల సంక్షేమంపై దృష్టిసారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ కార్యకర్తలు చిన్నారావు, రాజు పాల్గొన్నారు.

సుపరిపాలన బీజేపీతో సాధ్యం

రామభద్రపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేద ప్రజల సంక్షేమం దిశగా మోడీ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు రూపొందిస్తోందన్నారు. జీఎస్టీ రేట్ల తగ్గింపు తో ప్రజలకు ఎంతో మేలు జరుగుతోందన్నారు. రైతులకు, మహిళల సంక్షేమం కోసం కొత్త పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. దేశంలో ఎన్నడూలేని విధంగా అభివృద్ధి జరుగుతోందని వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆజురఫీ జాన్, బీజేపీ మండల అధ్యక్షురాలు మూడడ్ల ఆదిలక్ష్మి, బొబ్బిలి రూరల్ అధ్యక్షుడు తాడ్డి ఈశ్వరరావు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చొక్కాపు రామారావు, బొత్స అప్పయ్యమ్మ, పెరుమాళి శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూముల పరిశీలన

తెర్లాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో ప్రభుత్వ భూములను సర్వేయర్‌లు పరిశీలిస్తున్నారు. శనివారం తెర్లాం పంచాయతీలో జరుగుతున్న సర్వేను తహసీల్దార్ హేమంత్‌కూమార్ పరిశీలించారు. సర్వే పక్కాగా చేయాలన్నారు. డిపట్టా భూములను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సర్వేయర్లను ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌ఐ కృష్ణమూర్తి, వీఆర్వోలు శ్రీను, రాము, సుధాకర్, సర్వేయర్ శర్వాణి ఉన్నారు.

బిల్లులు చెల్లిస్తాం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇంకుడు గుంతల బిల్లులు చెల్లిస్తామని ఉపాధిహామీ పథకం ఏపీవో రమ్య తెలిపారు. శనివారం ముషిడిపల్లిలో ఎంపీపీ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో సచివాలయంలో సమీక్షించారు.ఈ సందర్భంగా దొర్లపాలెం గ్రామానికి చెందిన గిరిజనుడు పైడిరాజు ఇంకుడుగుంతల బిల్లులపై ప్రశ్నించాడు. ఏప్రిల్‌లో పనులు పూర్తిచేసి బిల్లుల కోసం తిరుగుతున్నామని వాపోయాడు. ఈ విషయంపై ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఏపీవో రమ్యను వివరణ కోరగా త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. తన ఎకరా పండ్ల తోట భూమిను జిందాల్ కంపెనీ ఆక్రమించుకుందని, న్యాయం చేయాలని కలెక్టర్ కార్యాలయం చూట్టు ఏడాదిగా తిరుగుతున్న పట్టించుకోలేదని గిరిజనమహిళ రొంగలి చిన్నారి వాపోయింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధారాజు, గ్రామపెద్దలు కనకం,సన్యాసిరావు పాల్గొన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

కొత్తవలస, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపాలెం ఎంపీయూపీ పాఠశాలకు సర్పంచ్ మాకెన సీతారామపాత్రుడు (నవీన్) కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మజ్జి కనకేష్, మాజీ సర్పంచ్ పల్లా రామయ్య, హెచ్‌ఎం జీవీ పద్మజ పాల్గొన్నారు.

సోంపురం రోడ్డుకు నిధులు

వేపాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోంపురం-ఆనందపురం రహదారికి మోక్షం కలగనుంది. రాష్ట్రంలో రోడ్లు భవనాలశాఖ పరిధిలో ఎన్‌డీబీ ప్రాజెక్టులో భాగంగా అభివృద్ధిచేసే రోడ్లు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లతో ఆ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారని వేపాడ మండల రోడ్లు భవనాలశాఖ ఏఈ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు 239 కోట్లు రూపాయలు మంజూరు చేసిందని పేర్కొన్నారు.

విజ్ఞానాన్ని పెంపొందించుకోండి

రామభద్రపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్యతో పాటు విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఈవో ఆమిటి తిరుమలప్రసాదరావు సూచించారు. పాతరేగ జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన చెకుముకి పాఠశాల స్థాయి పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడుకు పదునుపెట్టే విధంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం చప్ప రమణతో ఆయన మాట్లాడారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలన్నారు.

యువత కళ్లల్లో ఆనందం

లక్కవరపుకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యు వత భవిష్యత్‌కు గేమ్ చేంజర్‌గా విశాఖ నిలవనుందని ఎస్.కోట నియోజకవర్గ తెలుగు యువత నేత వాకాడ బాలు పేర్కొన్నారు. నారా లోకేష్ స్వశక్తితో గూగుల్‌ను విశాఖ నగరానికి తీసుకువచ్చి యువత కళ్లల్లో ఆనందం నింపారని తెలిపారు. శనివారం ఎల్.కోటలో తెలుగు యువత నియోజకవర్గ సమావేశం నిర్వహించారు.ఈ కార్య క్రమంలో మండల అధ్యక్షుడు శ్రీనాథు రాజేష్, టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు డెక్క ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు జి.గణేష్ పాల్గొన్నారు.

'సూర్యఘర్' వినియోగించుకోవాలి

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్యఘర్ పథకాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకో వాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామా రావు సూచించారు. శనివారం స్థానిక సబ్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రామారావు మాట్లాడుతూ సూర్యఘర్ పథకంపై మాట్లాడారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈ పిచ్చయ్య, టీడీపీ నాయకుడు లెంక అప్పలనాయుడు, వానపల్లి వీరభద్రరావు, జనసేన నాయకులు ఎంఎం.నాయుడు, అవనాపు మురళీకృష్ణ, కాళ్ల మహేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయండి

రామభద్రపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో రత్నం కోరారు. శనివారం ఆరికతోట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహారం అందించడంలో అలసత్వం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చిన్నారులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమలప్రసాద్ పాల్గొన్నారు.

షాపు పెట్టాలంటే ఇచ్చుకోవాల్సిందే!

(7వ పేజీ తరువాయి)

ఖర్చులు కలిపి దాదాపుగా రూ.1500 అవుతుంది. కానీ, జిల్లాలో అనుమతి పొందడానికి ప్రతి షాపు యజమాని రూ.20 నుంచి రూ.30 వేలు వరకూ అధికారులకు సమర్పించినట్లు తెలుస్తోంది. డబ్బులే కాకుండా బాణసంచా సామగ్రి కూడా అధికారులకు ఇవ్వాల్సి వస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. ఇంత పెద్ద మొత్తంలో ఖర్చు చేసి ఏర్పాటు చేసిన దుకాణాలను రెండు, మూడు రోజులు మాత్రమే నిర్వహిస్తారు. ఈ ఖర్చును వినియోగదారుల నుంచి రాబట్టుకునే పనిలో పడ్డారు. దీనికోసం బాణసంచా ధరలను అధికంగా పెంచి విక్రయిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

(7వ పేజీ తరువాయి)

పెద్దచెరువు గట్టుపై మొక్కలను నాటారు. ముందుగా నగరపాలక సంస్థలో ఉత్తమ సేవలు అందించిన 12 మంది పారిశుద్య కార్మికులకు దుశ్శాలువాతో సత్కారం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నల్లనయ్య, కాలుష్య నియంత్రణాధికారి సరిత, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, మెప్మా పీడీ చిట్టిరాజు, స్థానిక టీడీపీ నాయకులు ఐవీపీ రాజు, బొద్దల నరసింగరావు, ఏఎంసీ చైర్మన్ కర్రోతు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.850 కోట్ల లింకేజీ రుణాల లక్ష్యం

(7వ పేజీ తరువాయి)

చెప్పారు. మిగిలిన రుణ లక్ష్యాలను నిర్ణీత గడువులోగా సాధిస్తామన్నారు. బ్యాంకు అధికారులు చాలా బాగా స్పందిస్తున్నారని తెలిపారు. మన్యం జిల్లాలో టూరిజం ప్రాంతాల అభివృద్ధి పనులను స్వయంసహాయక సంఘాలకు అప్పగిస్తున్నారని, విజయనగరం జిల్లాలో అలాంటి ప్రతిపాదన ఏమైనా ఉందా? అని ప్రశ్నించగా.. అలాంటిదేమీ ఇంతవరకు లేదని ఆయన బదులిచ్చారు. జిల్లాలో పెద్దసంఖ్యలో కొత్త పెన్షన్ల మంజూరు కోసం వితంతువులు, వృద్ధులు ఎదురుచూస్తున్నారని ఆయన దృష్టికి తేగా, రేషన్ కార్డుల నిబంధనలు సడలించుకున్న వారికి పెన్షన్లు మంజూరు చేయడం సాధ్యపడుతుందని అన్నారు.